సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం। 30। నవంబర్। 2024



ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

ప్లాస్టిక్ వ్యర్థాలతో మానవాళికి అనేక అనర్థాలు కలుగుతున్నాయని చింతూరు డీఎఫ్‌వో బబిత అన్నారు. 8లో



మార్గదర్శితో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

మార్గదర్శి కార్యక్రమాన్ని విద్యా సంస్థల్లో విజయవంతంగా నిర్వహించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. 8లో



వినతులపై దృష్టి పెట్టండి

ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

పెరిగిన ఉష్ణోగ్రతలు



పాడేరు ప్రాంతంలో కారుమబ్బులు

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో వాయుగుండం ,తుపాను ప్రభావంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. గురువారం వరకు 8 నుంచి 15డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలతో పొగమంచు తీవ్రతతో పాటు చలిగాలులు విజృంభించే పరిస్థితి. అయితే శుక్రవారం ఉదయం నాటికి వాతావరణ మార్పులు ఏర్పడ్డాయి.మంచు కురవాల్సిన సమయంలో ఉదయం ఆకాశం నిండా కారుమబ్బులు కమ్ముకున్నాయి.అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 18డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 16డిగ్రీలు, పాడేరులో 16.1 డిగ్రీలు నమోదు అయ్యాయి.

వాతావరణంలో మార్పులే కారణం: ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: వాతావరణంలో మార్పులు కారణంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి అప్పలస్వామి తెలిపారు. అనంతగిరిలో 17.9, చింతపల్లిలో 16.5, దుంబ్రిగుడలో 17.3, జి.మాడుగులలో 16.9, జీకేవీధిలో 15.0, హుకుంపేటలో 14.5, కొయ్యూరులో 18.9, ముంచంగిపుట్టులో 18.4, పెదబయలులో 14.5 డిగ్రీలు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు.

జెడ్పీఎఫ్, జీపీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి

- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు డిమాండ్

దుంబ్రిగుడ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి జెడ్పీఎఫ్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు తక్షణమే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులు కుటుంబ అవసర నిమిత్తం పొదుపు చేసిన డబ్బులను విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, ఉద్యోగులు బయట వడ్డీకి తీసుకు వచ్చి వాటిని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి తక్షణమే తమకు రావలసిన డబ్బులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మండల నాయకుడు శ్రీను పాల్గొన్నారు.

రానున్న వారం రోజుల్లో తేలికపాటి వర్షాలు

- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి



చింతపల్లి: జిల్లాలో రానున్న వారం రోజుల్లో తేలికపాటి జల్లులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఈ వారం రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 21.8 డిగ్రీల నుంచి 24.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 16.4 డిగ్రీల నుంచి 17.9 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. గాలిలో తేమ శాతం ఉదయం వేళల్లో 90 నుంచి 95 శాతం మధ్యాహ్నం వేళల్లో 78 నుంచి 85 శాతం ఉండవచ్చునని పేర్కొన్నారు. గాలి గంటకు 2.5 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపారు. గిరిజన రైతాంగం వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే కోసిన వరి పనలను పొలాల్లోంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన కోరారు.

అరకులో సినిమా షూటింగ్ సందడి



అరకు వారపుసంతలో షూటింగ్ సందడి

దుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపుసంతలో శుక్రవారం సేవెన్ పీఎం ప్రొడక్షన్స్‌లో దగ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాకు సంబంధించి షూటింగ్ సందడి నెలకొంది. హీరోగా తిరువీర్, హీరోయిన్‌గా నూతన నటి టీనాశ్రావ్య, బాలనటుడు రోహన్‌పై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. డైరెక్టర్‌గా రాహుల్ శ్రీను, నిర్మాతగా సందీప్ అగారం వ్యవహరిస్తున్నారు. అరకు, అంజోడా పైనరీ, దుంబ్రిగుడ, అరకులోయ తదతర ప్రాంతాల్లోనూ ముఖ్య సన్నివేశాలను చిత్రీకరిస్తామని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.



బొడ్డాపుట్టులో చురుగ్గా జరుగుతున్న ఇంటి నిర్మాణం



హుకుంపేట మండలం బిజ్జాపల్లిలో ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన ఆదివాసీ కుటుంబం

- పీఎం జన్‌మన్ పథకం పేదలకు వరం
- జిల్లాకు 25,578 ఇళ్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేంద్రానికి నివేదిక

ఆదివాసీలకు గృహయోగం

ఐటీడీఏల వారీగా ఇళ్ల వివరాలు

పాడేరు ఐటీడీఏ	:	20,169
రంపచోడవరం	:	5041
చింతూరు	:	368

సాక్షి,పాడేరు: జిల్లాలో ఆదివాసీ కుటుంబాలకు పీఎం జన్‌మన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్ల లేని ఆదివాసీలను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటిలో కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. దీంతో జిల్లాలోని ఆదివాసీ కుటుంబాలకు 25,578 పక్కా గృహాలను కేంద్రం మంజూరు చేసింది. ప్రతి ఇంటి నిర్మాణానికి 2.39 లక్షలు అందిస్తోంది. మూడు విడతల్లో రూ.2 లక్షల నగదు, ఉపాధి పథకంలో 90రోజుల పనిదినాలకు రూ.27వేల చొప్పున కూలి సొమ్ము, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు మంజూరు చేస్తోంది. వచ్చే మార్చి నాటికి పూర్తిచేసే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాల పనులను జిల్లా అధికార యంత్రాంగం వేగవంతం చేసింది. పునాదులు పూర్తయిన వెంటనే మొదటి విడత బిల్లు రూ.70 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతోంది. ఇళ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్, ఐటీడీఏ పీవోలు,గృహనిర్మాణ సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహకారం అందిస్తున్నారు.

తొలి విడత బిల్లు మంజూరు



ఇంటిల్లపాడి పెంకుల గుడిసెలో జీవిస్తున్నాం. పీఎం జన్‌మన్‌లో పక్కా ఇల్లు మంజూరు కావడంతో సంతోషంగా ఉంది. కుటుంబంలో అందరం కలిసి నిర్మాణ పనులు చేపట్టాం. పునాదులు పూర్తయిన వెంటనే మొదటి విడత రూ.70వేల నగదు బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఈ మొత్తాన్ని నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్నాం.

– మత్రి సింగారి, బిజ్జాపల్లి, హుకుంపేట మండలం

మార్చి నాటికి పూర్తి



జిల్లా వ్యాప్తంగా పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నాం. ఇళ్ల నిర్మాణాలకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు.సిబ్బంది లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశాలిచ్చాం.ఎక్కడ అవినీతి చోటుచేసుకున్నా లబ్ధిదారులు నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

వరి కోతలు వాయిదా వేయండి

- జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు
- రైతులకు సూచన



చంపాపుట్టులో రాజ్‌మా పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నందు తదితరులు

పెదబయలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని తమరాడ, చంపాపుట్టు, అర్లాబు, పోయిపల్లి గ్రామాల్లో ఏపీ విత్తనశుద్ధి సంస్థ మేనేజర్ నాగసాయితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3 వరకు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున వరి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి పనలను పొలాల్లో ఉంచకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు వేసి వాటిపై టార్పాలిన్లు కప్పాలని సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని, గ్రామ సచివాలయం పరిధిలో ఉండే వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో రాజ్‌మా పంట ఆశాజనకంగా ఉందన్నారు. రైతులు వరుస క్రమంలో రాజ్‌మా నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. పూత సమయంలో కలుపులేకుండా చూస్తే మొక్క బలంగా పెరుగుతుందన్నారు. దిగుబడిలో కొంతమేర విత్తనాలకు కేటాయించి భద్రపరచుకోవాలని సూచించారు. రాగులు కంకులు పెద్దవి రావడం వల్ల దిగుబడి బాగుంటదన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, వ్యవసాయ ఉద్యానవన సహాయకులు శైలజ, శివలింగం, రామకృష్ణ పాల్గొన్నారు.

5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

మహారాణిపేట(విశాఖ): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వచ్చేనెల 5 నుంచి 14వ తేదీ వరకు సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. డిసెంబర్ 2న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి ఆ రోజు నుంచే నామినేషన్లు స్వీకరిస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 316 సాగునీటి సంఘాలు ఉన్నాయి. విశాఖ జిల్లాలో 29 సాగునీటి సంఘాలు, అనకాపల్లి జిల్లాలో 259 సాగునీటి సంఘాలు,ఏఎస్సార్ జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవరాల పరిధిలో 28 సాగునీటి సంఘాలు ఉన్నాయి.

క్లాస్–4 ఉద్యోగాలు గిరి యువతకు కేటాయించాలి

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : స్థానిక వైద్య కళాశాలలో క్లాస్–4 ఉద్యోగాలను స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు కేటాయించి ఉపాధి కల్పించాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వైద్య కళాశాలలో క్లాస్–4లో వివిధ కేటగిరిల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్‌లో జనరల్‌కు కేటాయించారన్నారు. ఇలా జరిగితే స్థానిక గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై తక్షణమే స్పందించి అర్హులైన గిరిజన నిరుద్యోగులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల సొమ్ము స్వాహా

- ఉడాయించిన బిల్లు కలెక్టర్
- సస్పెండ్ చేసి విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు

కూనవరం: చింతూరు డివిజన్ పరిధిలో కూనవరం, వీఆర్ పురం మండలాల్లో విద్యుత్ బిల్లులు వసూలు చేసిన సొమ్మును బిల్లు కలెక్టర్ స్వాహా చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ తదుపరి నెల బిల్లుతో పాటు కట్టిన బిల్లులు కూడా పునరావృతం అయ్యాయి. దీనిపై వినియోగదారులు ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వసూలు చేసిన మొత్తం సుమారు రూ.13 లక్షలకు పైగా బిల్లు కలెక్టర్ భరత్ స్వాహా చేసి ఉడాయించినట్టు తెలిసింది. దీనివల్ల నవంబరు నెల బిల్లుల వసూలు పెండింగ్‌లో పడ్డాయి. ఈ నెల బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు సిద్ధంగా ఉన్నా, ఎక్కడ కట్టాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. స్థానిక సబ్‌స్టేషన్ అధికారులను సంప్రదిస్తే ఫోన్‌పే ద్వారా చెల్లించండి అని అంటున్నారు. ఇలా సాధ్యపడనివారిని, సచివాలయం/మీసేవలో చెల్లించాల్సిందిగా చెబుతున్నారు. అక్కడికి వెళ్తే మావల్ల కాదని వారు చేతులెత్తేసినట్లు వినియోగదారులు వాపోతున్నారు. దీనివల్ల పెనాల్టీ పడే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. దీనిపై జగ్గంపేట ఏఏవో ఈఆర్‌వో రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా బిల్లు కలెక్టర్ భరత్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా అతనిపై కేసు పెట్టామన్నారు. కూనవరంలో 330 మంది వినియోగదారులు చెల్లించిన రశీదులు పరిశీలించగా రూ.7 లక్షల వరకు స్వాహా జరిగినట్టు భావిస్తున్నామని ఆయన తెలిపారు. విచారణ పూర్తయిన తరువాత స్వాహా చేసిన మొత్తం సొమ్మును రికవరీ చేస్తామని ఆయన వెల్లడించారు.

అరకు రైలుకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): అరకు రైలుకు ప్రయాణికులరద్దీ దృష్ట్యా ఆయా తేదీల్లో అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు1, 3వ తేదీల్లో 1–విస్టాడోమ్ కోచ్, డిసెంబర్ 2,4వ తేదీలలో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్, తిరుగుప్రయాణంలో కిరండూల్ –విశాఖ(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2,4వ తేదీల్లో 1–విస్టాడోమ్, డిసెంబరు 3,5వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను జత చేస్తున్నారు.

గంజాయితో ప్రమేయం ఉంటే పథకాలు రద్దు

ఎస్పీ అమిత్ బర్దర్



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు : గంజాయి సాగు, రవాణా, గంజాయి సేవించడం తదితర వాటితో ప్రమేయం ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దు చేస్తామని ఎస్పీ అమిత్‌బర్దర్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జరిగిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో క్రైం రేట్‌ను తగ్గించాలని, గంజాయి తనిఖీలు మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలని, డ్రోన్ల సహాయంతో గంజాయి సాగు గుర్తించి పంటను ధ్వంసం చేయాలని ఆదేశించారు. ప్రజలను మంచి మార్గం వైపు నడిపించేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ పూర్తి చేయాలని, ఛార్జిషీట్లను కోర్టులో సమర్పించాలన్నారు. పెండింగ్ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై గ్రామాల్లో, విద్యా సంస్థల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలన్నారు. త్వరలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పక్క రాష్టాల్లో మావోయిస్టు కదలికలు ఉన్న తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా, డీస్పీలు కె.ప్రమోద్, ఎస్కే షాహబజ్ అహ్మద్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జి. సంజీవరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి. అప్పలనాయుడు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి పెడితే ఉన్నతస్థానం



హుకుంపేట కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



బాలసదనంలోని బాలికలతో ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

హుకుంపేట: విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతస్థాయికి ఎదగాలని ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం వల్లే ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని, వీటిని విద్యార్థినులు వ్యతిరేకించాలని కోరారు. చదువులు పూర్తి స్థాయిలో కొనసాగించి ఉన్నతస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహ రహిత గ్రామం, మండలంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. బలవంతంగా వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, గ్రామసచివాలయ సిబ్బందికి సూచించారు. విద్యార్థినులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకోవద్దని హితవు పలికారు. అనంతరం రంగశీల పంచాయతీ టిటింగ్‌వలసలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి, పీడీ ఎన్. సూర్యలక్ష్మి, సీడీపీవో బాలచంద్రమణి దేవి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జయప్రద పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు పటిష్ట చర్యలు

సాక్షి,పాడేరు: జిల్లాలో బాలికల సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. మోదమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. బాలసదనం బాలికలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమం లక్ష్యంగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తున్నామన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఐసీడీఎస్ ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి

- గిరిజన సంఘం, ఏబీవీపీ విద్యార్థి సంఘాల డిమాండ్
- గురుకులం ఎదుట ఆందోళన
- రూ.3 లక్షలు ఇచ్చేందుకు నిర్వాహకులు అంగీకరించడంతో విరమణ



పాఠశాల గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఏపీజీఎస్, ఏబీవీపీ సంఘాల ప్రతినిధులు



వసతి గృహంలో నిర్వాహకులతో చర్చిస్తున్న అధికారులు, బంధువులు

అరకులోయ రూరల్: మండలంలో యండపల్లివలస గురుకుల పాఠశాల విద్యార్థిని జన్ని ప్రియాంక మృతిపై విచారణ జరిపించాలని గిరిజన సంఘం, ఏబీవీపీ విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించి నినాదాలు చేశారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, ఏబీవీపీ జిల్లా అధ్యక్షురాలు గీత వేర్వేరుగా మాట్లాడారు. గిరిజన విద్యార్థుల వరుస మరణాలు ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని ప్రియాంక మృతి చెందిందని ఆరోపించారు. నాణ్యమైన భోజనం లేకనే రక్త హీనతతో విద్యార్థులు వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గురుకులాల వసతి గృహాల్లో రోజువారీ మండల స్థాయి అధికారులు పర్యవేక్షించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇలావుండగా దీనిపై ప్రిన్సిపాల్ వెంకటనాయుడును వివరణ కోరగా అనారోగ్యంతో ఉన్నట్టు గుర్తించి ఆస్పత్రికి పంపించామన్నారు. విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నందున తల్లిదండ్రులతో ఇంటికి పంపించలేదన్నారు. వాంతుల కారణంగా ఆరోగ్యం ఒక్కసారిగా విషమించిందన్నారు.

పాఠశాల సందర్శన

విద్యార్థిని మృతితో ఎంఈవో భారతిరత్న, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ప్రజాప్రతినిధులు గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు, పాఠశాల, వసతిగృహం నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థిని మృతికి కారణాలను తెలుసుకున్నారు. మృతురాలు కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగంతో పాటు బాధిత కుటుంబానికి రూ.3లక్షలు ఇచ్చేందుకు నిర్వాహకులు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, ఆధ్వర్యంలో పాఠశాల, వసతి గృహం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థిని మృతదేహానికి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు భగత్‌రాం, జోషి, ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రతినిధులు యోగి, ప్రీతి, రవి, చరణ్‌చంద్, రోహిత్, స్నేహ, వైష్ణవి, అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, సీపీఎం మండల కార్యదర్శి రామరావు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు

- వైద్యాధికారి రాంబాబు



దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దుంబ్రిగుడ: జాతీయ నాణ్యత ప్రమాణాలు పాటించి వైద్య సేవలు అందిస్తున్న స్థానిక పీహెచ్‌సీకి 94.6 శాతంతో జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని వైద్యాధికారి పి.రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఎస్ (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్) బృందం అన్ని కోణాల్లో పరిశీలించి సేవల సమాచారం సేకరించిందన్నారు. జాతీయస్థాయిలో గుర్తిస్తూ ఎన్‌క్యూఎస్ సర్టిఫికెట్‌ను విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు.

ముంచంగిపుట్టులో దొంగలు హల్‌చల్

- ఒకే రోజు నాలుగుచోట్ల దొంగతనాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు



దొంగలు తెరిచిన బీరువా



దుకాణంలో చిందర వందరగా పడేసిన సామాన్లు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు.మరో రెండు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం చేశారు. శుక్రవారం ఉదయం దుకాణాలను తెరిచేందుకు వచ్చిన యజమానులు తాళాలు పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో శ్యామలరావు, రమేష్ దుకాణాల తాళాలు పగులగొట్టి నిత్యావసర వస్తువులు, రూ.10 వేల నగదు పట్టుకుపోయారు. వీటికి పక్కనే ఉన్న నాగేశ్వరరావు ఇంటి తలుపులు చాకచక్యంగా తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని వెండి, ఇత్తడి వస్తువులను తీసుకుపోయారు. అయితే ఇంటి యజమాని నాగేశ్వరరావు విశాఖపట్నంలో ఉంటున్నారు. సాయిబాబా ఆలయ సమీపంలోని దుస్తులు, టైలరింగ్ షాప్ తాళాలు పగులగొట్టు విలువైన చీరలు, డ్రెస్ మెటీరియల్, పలు వస్తువులు ఎత్తుకుపోయారు. సుమారు రూ. 50వేల విలువైన దుస్తులు పట్టుకుపోయినట్టు యజమాని ఈశ్వరి తెలిపారు. వీటితోపాటు రెండు కిరాణా దుకాణాల తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

కూనవరం: ప్లాస్టిక్ వ్యర్థాలతో మానవాళికి అనేక అనర్థాలు కలుగుతున్నాయని చింతూరు డీఎఫ్‌వో బబిత అన్నారు. మండలంలోని భగవాన్‌పురం, కూటూరు గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మనవాళికి కలుగుతున్న అనర్థాలను ప్రతిఒక్కరూ ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కోరారు. వచ్చేనెల ఒకటి నుంచి పాపికొండలు జాతీయ పార్కు,ఇతర రక్షిత అటవీ ప్రాంతాల్లో సైతం ప్లాస్టిక్ నిషేధం అమలు జరుగుతుందన్నారు. శ్రమదానంతో 168 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు సాయి, అనిల్, శంకర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు,

నేడే అనంతుని దీపోత్సవం

పద్మనాభం: పద్మనాభంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. దీపోత్సవానికి అవసరమయ్యే తైలం, ప్రమిదలు, వత్తులను సిద్ధం చేసింది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి దర్శనానికి వెళ్లే భక్తులను సౌకర్యార్థం అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గిరి ప్రథమ పావంచా వద్ద, 1,200 మెట్ల వద్ద పందిరి వేశారు. 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ అప్పలరాజు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ముంచంగిపుట్టు: జోలాపుట్టులో ఉన్న అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి సుమారు 2వేలపైగా భక్తులు తరలివచ్చారు. అన్నప్రసాదం కార్యక్రమం సమయంలో ఏర్పాటు చేసిన హుండీని భక్తుల సమక్షంలో వేలం పాటను నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం లంతాపుట్టుకు చెందిన భక్తుడు నీలకంఠ పాత్రో హుండీని రూ.80,100లకు దక్కించుకున్నారు. హుండీ వేలం పాట ద్వారా వచ్చిన నగదును అయ్యప్ప పీఠం అభివృద్ధికి వినియోగిస్తామని గురుస్వాములు సూరిబాబు, గుప్తేశ్వరరావు, రాంబాబు, గోపాల్ చెప్పారు.



వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న గిరిజన రైతులు



కొయ్యూరులో వరి కోతల్లో కూలీలు



దుంబ్రిగుడలో వర్షంలో కూరగాయల విక్రయాలు

ముసిరిన మబ్బులు.. రైతుల్లో గుబులు

- మన్యంలో తుపాను ప్రభావం
- ఉదయం నుంచి జల్లుల వాన
- సురక్షిత ప్రాంతాలకు వరి పనల తరలింపు
- వరిపంటకు వర్షం ముంపు
- గిరిజన రైతుల ఆందోళన



పాడేరు-హుకుంపేట రోడ్డులో పొలాల్లో వరి పనలు

సాక్షి,పాడేరు/ముంచంగిపుట్టు/దుంబ్రిగుడ/కొయ్యూరు: బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం, ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో కొన్ని చోట్ల చిరుజల్లులు పడగా మరికొన్ని చోట్ల ఆకాశమంతా మేఘావృతమై కారుమబ్బులు ఉండటంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గిరిజన రైతాంగం ఆందోళన చెందుతుంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి,ఇతర చిరుధాన్యాల పంట కోతలు, పంట నూర్పిళ్లు జరుగుతున్న సమయంలో ఈ వర్షాలు గిరిజన రైతులను కలవరపరుస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతులంతా వరి, ఇతర చిరుధాన్యాల పంటలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాలలో గిరిజన రైతులు కోతకోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు నూర్పుల యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని గిరిజన రైతులు మాత్రం కోతకోసిన వరి పనలను పంట భూములకే పరిమితం చేస్తున్నారు. తుపానుతో వర్షాలు గిరిజన రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికి 40శాతం ఖరీఫ్ వరిపంట కోతలు పూర్తయ్యాయి. మిగిలిన వ్యవసాయ భూములన్ని పంట కోతలకు సిద్ధంగా ఉన్నాయి.ఈ పరిస్థితులలో భారీ వర్షాలు కురిస్తే పంట నష్టం తీవ్రంగా ఉంటుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతం అంతటా చెదురు ముదురు వర్షాలు పడుతుండటం ఆకాశంలో కారుమబ్బులు కన్పిస్తుండటం గిరిజన రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్ ప్రభావంతో గిరిజన రైతులు పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు.



మినుములపుట్టులో వరి కుప్పలపై టార్పాలిన్ కప్పుతున్న గిరిజన రైతులు

102 కిలోల గంజాయి స్వాధీనం

చెన్నైకు రవాణా చేసేందుకు మహిళ ప్రయత్నం



మాట్లాడుతున్న డీసీపీ-2 మేరీ ప్రశాంతి



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీసీపీ-2 మేరీ ప్రశాంతి

విశాఖ సిటీ: విశాఖ నుంచి తమిళనాడుకు రైలులో గంజాయి రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్న మధురైకు చెందిన మహిళను నగర పోలీసులు పట్టుకున్నారు. ఆమె నుంచి రూ.13 లక్షల విలువైన 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ-2 మేరీ ప్రశాంతి తెలిపారు. పోలీస్ సమావేశంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు స్టేషన్ వద్ద నిఘా పెట్టారు. కాగా.. ఈ నెల 28న ఒక మహిళ స్కూటీపై నాలుగు ప్లాస్టిక్ బ్యాగులతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాం చివరి నుంచి రైల్వేస్టేషన్‌లోకి తరలించే ప్రయత్నం చేసింది. ఇంతలో మహిళా పోలీస్ సిబ్బంది ఆమెను నిలువరించి ఆ బ్యాగులను తనిఖీ చేశారు. అందులో రెండు కిలోలు చొప్పున 51 ప్యాకెట్లలో 102 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని సీజ్ చేసి మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. మధురైకి చెందిన సెల్వి తన మామ లక్ష్మణన్ శేఖర్‌తో కలిసి విశాఖకు వచ్చినట్లు చెప్పింది. ముందుగా మామ గంజాయిని తీసుకువచ్చి సెల్వీకి అందించాడు. దీన్ని దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి చెన్నైకు తరలిస్తున్నట్లు ఆమె అంగీకరించిందని డీసీపీ తెలిపారు. ప్రస్తుతం కేసు ఇంకా విచారణలో ఉందని, ఇక్కడ ఎవరి నుంచి గంజాయిని కొనుగోలు చేశారు, తమిళనాడులో ఎవరికి విక్రయించాలనుకుంటున్నారు? ఇలా అన్ని విషయాలపై విచారిస్తున్నట్లు వెల్లడించారు. మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆమె మామ శేఖర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మధురై పోలీసులకు కూడా సమాచారం అందించినట్లు చెప్పారు. విశాఖను గంజాయి రహితంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నంతో నిఘాను పటిష్టం చేశామని డీసీపీ-2 మేరీ ప్రశాంతి తెలిపారు. ఒకటి కన్నా ఎక్కువ గంజాయి కేసులు ఉన్న వారిపై పీడీ యాక్ట్ నమోదుతో పాటు నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సౌత్ ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినతులపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- మీకోసంలో 86 అర్జీల స్వీకరణ

పాడేరు : సమస్యలపై ప్రజలనుంచి స్వీకరిస్తున్న వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆయన అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మలత ప్రజలనుంచి 86 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌బీఎస్ నందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్ కుమార్‌రావు, ఆర్అండ్‌బీ ఈఈ బాల సుందర బాబు, జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ ఈఈలు కే.వేణుగోపాల్, జి.డేవిడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో కొత్త కోర్సు

- ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్
- సిస్టమ్స్ కోర్సు నిర్వహణకు ఏర్పాట్లు



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న రిజిస్ట్రార్, పక్కన వీసీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో నూతనంగా ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ కోర్సును ప్రారంభిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఏయూతో అవాంటెల్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, అవాంటెల్ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్. శ్రీనివాసరావు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ కోర్సులో 18 మందికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు రెండో సంవత్సరంలో రూ.25 వేలు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు రూ.9 లక్షల వార్షిక వేతనంతో అవాంటెల్ సంస్థ ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకొచ్చిందన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్- వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా నూతన కోర్సులను రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు అనువైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవాంటెల్ అడ్వైజర్ డాక్టర్ నాగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అభ్యసనానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్(టెక్నికల్) ఎన్.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ వేణుగోపాల్ అట్లూరి, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.భాస్కర్, జనరల్ మేనేజర్(హెచ్.ఆర్) శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు సూచనలు

దుంబ్రిగుడ: ఆదివాసీలు సాగు చేసే భూమి సారం, విత్తనాలు, పంటలసాగుపై అవగాహన పరిచేందుకు ప్రత్యేక వేదిక అవసరమని పర్యావరణవేత్త సోహన్ చెప్పారు. రైతు సాధికార సంస్థ, సంజీవిని సంస్థ డైరెక్టర్ దేవుళ్లు ఆధ్వర్యంలో శుక్రవారం కిల్లోగుడలో విత్తనం, భూమి సారంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోహన్ మాట్లాడుతూ ఈ వేదిక ప్రధానంగా రైతుల మేలుకోసం ఏర్పాటుచేశామన్నారు. ఆదివాసీలు పండించే పంటల్లో కొన్ని నూతన విధానాలను అనుసరించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. లేత నారును నాటుకుంటే మేలైన ప్రయోజనం ఉందన్నారు. ఇండో హ్యూమన్ రైట్స్ ప్రతినిధి డేవిడ్, వాసన్ సంస్థ ప్రతినిధి నర్సింహ, గిరిజన ఫెసిలిటేటర్ జయశ్రీ, భాస్కరరావు, సీడబ్ల్యూఎస్ సంస్థ ప్రతినిధి బద్ర, ఆదివాసీ మిత్ర సభ్యులు మత్స్యరాజు, రైతు సాధికార సంస్థ ప్రతినిధి రామచంద్ర, పండన్న రైతులు పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో రైతులతో మాట్లాడుతున్న సంజీవిని సంస్థ డైరెక్టర్ దేవుళ్లు, పక్కన పర్యావరణవేత్త సోహన్



పెనికెలపాడులో బయోమాస్ తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న లయ సంస్థ ప్రతినిధులు

అడ్డతీగల: కలుపు మొక్కలను ఉపయోగించి తయారు చేసిన బయోచార్‌ని భూమికి ఎరువుగా ఉపయోగించడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని లయ స్వచ్ఛంద సంస్థ ఏరియా కో-ఆర్డినేటర్ జి.బుల్లయ్య అన్నారు.ఈ మేరకు కలుపు మొక్కలు సేకరించి దగ్ధం చేయగా వచ్చిన బయోమాస్ నుంచి బయోచార్ తయారీపై ఆదివాసీ రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు.అడ్డతీగల మండలం పెనికెలపాడు, నెల్లికోట గ్రామాల్లో 15 గ్రామాల నుంచి వచ్చిన 175 మంది ఆదివాసీ రైతులకు పలు అంశాలపై తెలియజేశారు. ఏజెన్సీలో గాలిగోపురం, పులికంప, వయ్యారిభామ వంటి కలుపు మొక్కలు విస్తారంగా ఉన్నాయన్నారు. వీటిని సేకరించి దగ్ధం చేసి వచ్చిన బయోమాస్‌తో బయోచార్ తయారుచేసి దానిని సాగు భూముల్లో ఎరువుగా వినియోగం వల్ల పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ మేరకు తయారీ విధానాన్ని చూపించారు. బయోచార్ వినియోగంతో ఏపుగా పెరిగిన చోడి పంటను రైతులకు చూపించి, ఉపయోగాలను ఆయన వివరించారు.

సంస్థలు-పరిశ్రమల సమన్వయంతోనే అభివృద్ధి



సదస్సులో బృందం సభ్యులు

విశాఖ విద్య: సంస్థలు-పరిశ్రమల సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఇండస్ట్రీ-అకాడెమియా సమ్మేళనం 2024 జరిగింది. ఇంధన రంగంలోని పురోగతి, సవాళ్లపై విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సన్నిహిత సహకారం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడం, వారికి ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఐపీఈ డీన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు కనుపర్తి నాగరాజా(హెచ్‌పీసీఎల్), డాక్టర్ సెంథిల్ మురుగన్ బాలసుబ్రమణ్యన్(రిలయన్స్), డా.మురళీకష్ణ కలగ(జీఈ వెర్నోవా), డా.కష్ణకాంత్, డా.హేమంత్ తదితరులు ప్రసంగించారు.

ఖోఖో పోటీల విజేత ఏఎంఏఎల్ కళాశాల



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఏయూ అంతర్ కళాశాలల ఖోఖో పోటీల విజేతగా అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల నిలిచింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. 28 కళాశాలలకు చెందిన 16 జట్లు విజయం కోసం హోరాహోరీగా తలపడగా.. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ఏయూ ఖోఖో జట్టు జాతీయస్థాయిలో రాణించాలని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

2 నుంచి శ్రీనృసింహ దీక్షలు ప్రారంభం

- జనవరి 12న రెండు దీక్షల ముగింపు

సింహాచలం: ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షలకు దేవస్థానం అధికారులు తిథులను అనుసరించి తేదీలను ప్రకటించారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 41 రోజుల మండల దీక్ష, డిసెంబర్ 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఆయా రోజుల్లో దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదికులు ఉదయం 7 గంటలకు మాలధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

మార్గదర్శితో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు


పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



హాజరైన ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు

పాడేరు : మార్గదర్శి కార్యక్రమాన్ని విద్యా సంస్థల్లో విజయవంతం చేసి తద్వారా విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. స్థానిక కాఫీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలకు విద్యార్థుల కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టెన్త్ తర్వాత చదువులు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వృత్తి విద్యా, వృత్తి మార్గదర్శకం, వృత్తి అంచనా, వృత్తి సమాచారం అనే అంశాలపై ఆయన విపులంగా వివరించారు. విద్యార్థులు సామాజిక ఆలోచాన విధానంలో మార్పు తీసుకురావాలన్నారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజనీ, డీఈవో బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

రోడ్డు పనుల అడ్డంకులపై ఎంపీడీవో విచారణ



మంగళపుట్టు వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీలో చీడిపుట్టు, మంగళపుట్టు, కొత్తూరు గ్రామాల మధ్య నిధులు మంజూరైనా రోడ్డు పనులకు నెలకొన్న అడ్డంకులపై శుక్రవారం ఎంపీడీవో శ్రీసాయిహర్ష ఆయా గ్రామాలకు వెళ్లి గిరిజనులతో మాట్లాడి విచారణ చేశారు. గత 20ఏళ్లకు పైగా రోడ్డు సమస్య నెలకొందని, భూమి దారుడు రోడ్డు నిర్మాణానికి తన స్థలం మీదుగా రోడ్డు వేసేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తుండడంతో రోడ్డుకు నిధులు మంజూరైన నిర్మాణం జరగడం లేదని, రేషన్ సరుకులు, అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల గిరిజనులు, సీపీఎం నేతలు ఎంపీడీవోకు తెలియజేశారు. దీనిపై ఎంపీడీవో శ్రీసాయిహర్ష మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు పనులకు నెలకొన్న అడ్డంకులపై విచారణ చేయడం జరిగిందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. పీఆర్ ఏఈ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సింహాచలం, సీపీఎం నేతలు లైకోన్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

అనకాపల్లి: కేడీపేట పోలీస్‌స్టేషన్ పరిధి భీమవరం చెక్‌పోస్ట్ వద్ద 25 కేజీల గంజాయితో పాటు రూ.11.06 లక్షల నగదుతో పట్టుబడిన కర్ణాటకకు చెందిన ఇద్దరి వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో రూ.12.50 లక్షల నగదును తీసుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి కొనుగోలుకు వెళ్లారు. అక్కడ రూ.1.25 లక్షల విలువ గల గంజాయిని కొనుగోలు చేసి, మిగిలిన నగదును కారులో పెట్టుకుని, రొంపుల ఘాట్ నుంచి అయితే చెకింగ్ ఉంటుందని భావించి, కేడీపేట మీదుగా వచ్చారు. రాజమండ్రి వెళ్లే సమయంలో కేడీ పేట భీమవరం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడినట్టు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

12 కేజీల గంజాయి స్వాధీనం

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు తిమ్మాపురం మీదుగా గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు శుక్రవారం తెలిపారు.

ఒడిశా నుంచి కడపకు ఈ గంజాయిని తరలించేందుకు ప్రయత్నిస్తునట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు అడ్డురోడ్డు వద్ద తనిఖీలు చేసి పట్టుకున్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ చెప్పారు.